క్లుప్తంగా...

పారిశుద్ధ్య కార్మికులకు చీరల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు చీరలు అందజేస్తున్న సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి దంపతులు

ఘట్‌కేసర్: దసరా పండగను పురస్కరించు కొని అవుషాపూర్ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ కార్మికులకు సర్పంచ్ కావేరిమశ్చేందర్ రెడ్డి దంపతులు సొంత నిధులతో శనివారం చీరలు అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామం శుభ్రంగా ఉండేందుకు వారు చేస్తున్న కృషి, శ్రమకు వెలకట్టలేమని అన్నారు. కార్యక్రమంలో పద్మారెడ్డి, శారద, మశ్చేందర్‌రెడ్డి, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి బరిలో హరివర్ధన్‌రెడ్డి..?

- మేడ్చల్ కాంగ్రెస్ నుంచి టికెట్ రాకపోవడంతో..
- ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో పనిచేసిన అనుభవం
- రెండవ లిస్ట్‌లో పేరు చేర్చినట్లు సమా చారం
- పోటీ చేసేదీ.. లేనిదీ.. పండగ తర్వాతే..



సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి

మేడ్చల్: మేడ్చల్ నియోజకవర్గం కాంగ్రెస్ టికెట్ రాకపోవడంతో అలకబూనిన సీనియర్ నాయకుడు పార్టీ జెడ్పీ ఫ్లోర్‌లీడర్ సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డిని బుజ్జగించే పనిలో అధిష్టానం పడింది. ఏళ్లుగా మేడ్చల్ నియోజకవర్గంలో రాజకీయం చేస్తున్న హరివర్ధన్‌ను దూరం చేసుకుంటే పార్టీ అభ్యర్థి గెలుపు ఓటములపై ప్రభావం చూపే అవకాశం ఉందని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్టానం ఆయనకు జిల్లాలోని కూకట్‌పల్లి నియోజకవర్గం టికెట్ కేటాయించి, అక్కడి నుంచి బరిలోకి దించాలని యోచిస్తున్నట్లు తెలిసింది. హరివర్ధన్‌రెడ్డి నియోజక వర్గంలో మాత్రమే కాకుండా ఉమ్మడి రంగారెడ్డి జిల్లా రాజకీయం చేసిన నాయకుడు. గతంలో మేడ్చల్, పరిగి నియోజకవర్గాల నుంచి పోటీ చేసి ఓడిపోయారు. ఉమ్మడి జిల్లాలో క్రియాశీలక నాయకుడిగా ఉన్నారు. నగరంలోని హబ్సిగూడ నుంచి కాంగ్రెస్ తరపున కార్పొరేటర్‌గా ఎన్నికై ఐదేళ్ల పాటు పనిచేశారు. మేడ్చల్ టికెట్ ఆశించిన హరివర్ధన్‌రెడ్డి తాను గెలుపు గుర్రమైనా బీసీ నినాదంతో టికెట్ రాలేదని ఆయన వాదన. దీంతో తనకు టికెట్ ఎందుకు ఇవ్వలేదని, సర్వే రిపోర్టులను బయటపెట్టాలని బహిరంగంగానే డిమాండ్ చేస్తున్నారు.

కూకట్‌పల్లి నుంచి బరిలోకి..

అసమ్మతితో రగులుతున్న హరివర్ధన్‌రెడ్డికి న్యాయం చేయాలనే ఉద్దేశ్యంతో ఆయన్ను జిల్లాలోని కూకట్‌పల్లి నుంచి బరిలోకి దించాలని రెండవ లిస్ట్‌లో పేరు చేర్చినట్లు సమాచారం. హరివర్ధన్‌రెడ్డి నివాసముండే బోయిన్‌పల్లి ప్రాంతం కూకట్‌పల్లి నియోజకవర్గ పరిధిలో ఉండటం, ఆయనకు గతంలో నగరంలో పనిచేసిన అనుభవం ఉండటం, కూకట్‌పల్లి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్న నాయకుల మధ్య పెద్దగా పోటీ లేకపోవడంతో ఆయనను అక్కడి నుంచి రంగంలోకి దించాలని రేవంత్‌రెడ్డి దూతలు మల్లు రవి యత్నాలు చేస్తున్నట్లు తెలిసింది. ఈ మేరకు సెకండ్ లిస్ట్‌లో ఆయన పేరు ఖరారు చేసి జాబితాలో నమోదైందని హరివర్ధన్‌రెడ్డి అనుచరులు జాబితాను చూపిస్తున్నారు. హరివర్ధన్‌రెడ్డి మాత్రం తాను పోటీ చేసేది.. లేనిదీ.. దసరా పండగ తర్వాత ప్రకటిస్తానని చెబుతున్నారు.

కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడిగా ముత్యాలుయాదవ్



నియామక పత్రం అందజేస్తున్న టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేశ్‌యాదవ్

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పట్టణానికి చెందిన మామిండ్ల ముత్యాలు యాదవ్ ఎంపికయ్యాడు. ఈ మేరకు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర వజ్రేశ్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఆంజనేయులుయాదవ్ సమక్షంలో శనివారం నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ముత్యాలుయాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యత అప్పగించినందుకు పార్టీ అభివృద్ధికి, సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామన్నారు.

బీఆర్ఎస్‌కు ఉద్యమకారుడి రాజీనామా



పులికంటి దామోదరరెడ్డి

ఘట్‌కేసర్: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ మండల ప్రచార కమిటీ మండల మాజీ కార్యదర్శి పులికంటి దామోదర్‌రెడ్డి ఆ పార్టీకి శనివారం రాజీనామా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ స్థాపించినప్పటి నుంచి పార్టీ వెన్నంటే ఉన్నానన్నారు. రెండు దశాబ్దాలుగా సేవలందిస్తున్నా పార్టీలో సముచిత స్థానం ఇవ్వడం లేదని, పార్టీ కార్యక్రమాలకు కూడా సమాచారం ఇవ్వడం లేదన్నారు. తెలంగాణ సాధనలో ముందున్న ఉద్యమకారులకు రవం ఇవ్వనందుకు నిరసనగా రాజీనామా చేశానన్నారు.

నగదు, బంగారం సీజ్‌పై మార్గదర్శకాలను పాటించాలి



జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల సమయంలో నిర్వహించే తనిఖీల్లో నగదు, బంగారం సీజ్ చేసే సమయంలో పాటించాల్సిన నిబంధనలపై క్షేత్రస్థాయి అధికారులకు సంపూర్ణ అవగాహన కల్పించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ అన్నారు. సీజ్ చేసిన నగదు, బంగారం వివరాలను సంబంధిత వ్యక్తులకు తెలపడంతో పాటు ఎక్కడ అప్పీల్ చేయాల్సి ఉంటుందో పేర్కొంటూ.. రశీదు తప్పనిసరిగా అందజేయాలన్నారు. సీజ్ చేసిన బంగారం, నగదు రూ.10 లక్షల కంటే తక్కువైతే వెంటనే జిల్లాస్థాయిలో ఏర్పాటు చేసిన గ్రీవెన్స్‌సెల్‌కు అప్పగించాలన్నారు. రూ.10 లక్షల కంటే ఎక్కువ నగదు సీజ్ చేస్తే ఐటీ అధికారులకు అప్పగించాలని తెలిపారు. సదరు నగదుపై వచ్చే అప్పీళ్లను సంబంధిత సెల్, ఐటీ అధికారులు పరిశీలించి నిబంధనలు, ఆధారాల ప్రకారం తదుపరి చర్యలు తీసుకుంటారని ఆయన తెలిపారు. అలాగే, ఎన్నికల సమయంలో సీజ్ చేసే నగదు, బంగారం, మద్యం ఇతర విలువైన అభరణాలపై మీడియాకు సమాచారం అందించాలన్నారు. అలాగే, సంబంధిత వ్యక్తులు చేసిన అప్పీల్.. విడుదల చేసే నగదు వివరాలను కూడా ప్రెస్‌కు అందించాలని, దీనికి సంబంధించిన సమాచారాన్ని ఎప్పటికప్పుడు నివేదిక రూపంలో నిర్ణిత నమూనాలో సమర్పించాలన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనలపై వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని, రాజకీయ పార్టీల, అభ్యర్థుల నుంచి వచ్చే ఫిర్యాదులకు తప్పనిసరిగా తీసుకున్న చర్యలపై లిఖిత పూర్వక సమాధానం అందించాలని సూచించారు. సమావేశంలో ఎన్నికల అధికారులు, నోడల్ అధికారులు పాల్గొన్నారు. దీనికి ముందు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్‌తో ఆయన మాట్లాడారు.

అన్నా.. దసరాకు ఏం లేదా..?

మేడ్చల్: అన్నా నమస్తే.. ఎన్నికలు ఎట్ల నడుస్తున్నాయి.. ఈ సారి మనోడు గెలుస్తాడా.. మనోడికి ఈ సారైనా అదృష్టం ఉందా.. ఆ కులం వారు ఎటు ఓటు వేస్తారు.. ఈ మతం వారు ఎటువైపు వెళ్తారు.. మన అన్న.. ఏమైనా రెడీ చేసుకుంటుండా.. వాడు ఎంత డబ్బులు పెడుతుంటారు.. ఏ.. అదేం లేదు ఒకరు వంద పెడితే.. మరొకరు రెండు వందలు పెడతారు.. దమ్ములేనిదే మేడ్చల్ వంటి కాస్లీ ఏరియాలో పోటీ చేస్తారా.. ఇలా ఎక్కడ నలుగురు జమైనా వినిపిస్తున్న మాటలు..

- మేడ్చల్ నియోజకవర్గంలో రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు ప్రధాన పార్టీలైన కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు తమ అభ్యర్థులుగా తోటకూర జంగయ్యయాదవ్, మంత్రి మల్లారెడ్డిలను ప్రకటించనప్పటికీ వారి అనుచరులు ప్రజల్లోకి వెళ్లడానికి వెనుకంజ వేస్తున్నారు. ఎన్నికలకు 40 రోజుల సమయం ఉండగా పార్టీల నాయకులు ప్రజల దగ్గరకు వెళ్లి ప్రచారం చేయడానికి వెనుకడుగు వేస్తున్నారు. దీనికి ప్రధాన కారణం మధ్యలో దసరా పండగ రావడం..
- రాష్ట్రంలో దసరా పండగంటే జోర్దార్ పండగ. మేకలు కోయడం, కొత్త బట్టలు కొనడం, వస్తువులు కొనడం, మద్యం తాగి ఎంజాయ్ చేయడం, చుట్టాలు, దోస్తులను పిలుచుకుని దావత్‌లు చేసుకోవడం లాంటివి చేయడం ఆచారంగా వస్తోంది. దసరా అంటేనే ప్రతీ కుటుంబంలో వేల రూపాయాల ఖర్చు. కుర్రకారు పండగ అంటేనే ఎంజాయ్.. ఎంజాయ్ అంటేనే పండగలా చేసుకుంటారు. దసరా అంటే ఖర్చుపండగ.
- దసరాకు తోడుగా ఈ సంవత్సరం ఎన్నికల పండగ రావడంతో నాయకులకు తిప్పలు తప్పడం లేదు. ఎక్కడకు వెళ్లినా చాలామంది దసరా కానుకలు, మందు, బట్టలు అడుగుతుండటంతో నాయకులు వెనుకడుగు వేస్తున్నారు. ఎన్నికల సమయం కావడంతో నాయకులు ముఖం చాటేసుకోలేని పరిస్థితి.
- ప్రస్తుతం విలువల రాకీయం కంటే ధన రాజకీయమే ఎక్కువగా నడుస్తుండటంతో ఎన్నికల సాకులు చూపి నాయకుల నుంచి కావాల్సినంత పిండుకోవాలనే ఆలోచనలు ఎక్కువ మందిలో కనిపిస్తోంది.. దసరా నొప్పి నాయకులకు ఎక్కువగా కనిపిస్తోంది.
- నాయకులు గ్రామాల్లో, వార్డుల్లో ప్రజల వద్దకు నేరుగా వెళ్లకుండా ఫోన్ల ద్వారా తమ అనుచరులను రాజకీయంగా పురమాయిస్తున్నారు. ఎక్కువ లోతుగా వెళ్లకుండా పైపైన తిరుగుతూ పండగ దాటేలా చూడాలని ఆలోచనలు చేస్తున్నారు. పండగ తర్వాత ఓటుకు ఇంత అని ఇయ్యక తప్పదు.. ఇప్పుడు ఖర్చుపెట్టి.. అప్పుడు పెడితే మన సారు తట్టుకోలేడు.
- దసరా జోలికి తక్కువగా వెళ్లాలని పైనాయకుల నుంచి కింది నాయకులకు ఆదేశాలు వెళ్తున్నాయి. అనుచరులకు ఇవ్వడం తప్పదు కాబట్టి వారికి పండగ ప్యాకేజీలు ఇస్తూ ఫస్ట్ తర్వాత మళ్లా చూసుకుందాం అని సముదాయిస్తూ రాజకీయం నడిపిస్తున్నారు.

- ఊళ్లకు వెళ్లే నాయకులకు పెద్దఎత్తున వినతులు
- ప్రజల వద్దకు పోలేకపోతున్నామంటున్న చోటా నేతలు
- మీద మీద తిరగండి.. పండగ తర్వాత చూద్దాం..
- కిందిస్థాయి నాయకులకు బడా నేతల సలహా..

ఓటరే మారాలి..

ప్రజలు డబ్బులకు అలవాటు పడి తమ ఓటు అమ్ముకున్నన్ని రోజులు నాయకుల తీరు ఇలాగే ఉంటుంది. దసరా వచ్చిందని, దీపావళి వచ్చిందని ఓటరు ప్రలోభాలకు లొంగకుండా ఓటు వేస్తే ప్రజాస్వామ్యం పది కాలల పాటు వర్ధిల్లుతుంది.

\- ఓటరు, మేడ్చల్.

ఈవీఎం తరలింపునకు ఏర్పాట్లు పూర్తి

సాక్షి, మేడ్చల్ జిల్లా: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఐదు నియోజకవర్గాలకు కేటాయించిన ఈవీఎంల తరలింపునకు ఏర్పాట్లు పూర్తిచేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్ ఈవీఎం గోదాం నుంచి ఐదు నియోజకవర్గాల కేంద్రాలకు కంట్రోల్ యూనిట్లు, బ్యాలెట్ యూనిట్లు, వీవీప్యాట్లు తరలింపు కోసం రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి ఆయన ఏర్పాట్లను పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పార్టీల సమక్షంలో ఆన్‌లైన్ ద్వారా మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తిచేసుకోగా, శనివారం పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోదాములను తెరిచి ర్యాండమైజేషన్ ప్రకారం ఓటింగ్ యంత్రాలను సిద్ధం చేస్తున్నామన్నారు. వీటిని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల వారిగా డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలకు తరలించి భద్రపరస్తామన్నారు.

జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ

పోలీసులు ఎఫ్ఎస్టీ బృందాలు తనిఖీల్లో స్వాధీనం చేసుకున్న నగదు, ఇతర వస్తువులను పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు శనివారం కలెక్టరేట్‌లో జిల్లా గ్రీవెన్స్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశాన్ని నిర్వహించారు. స్వాధీనం చేసుకున్న నగదు విడుదల చేసేందుకు వచ్చిన ఫిర్యాదులు, దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాల్సి ఉంటుందన్నారు. జిల్లా గ్రీవెన్స్ కమిటీ కన్వీనర్లు జిల్లా సహకార అధికారి శ్రీనివాసమూర్తి(91001 15724), డీటీఓ నర్సింహరావు (77999 34204), జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి పద్మజారాణి (73309 99280) వ్యవహరిస్తున్నారన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే జిల్లా గ్రీవెన్స్ కమిటీ ప్రతినిధులను సంప్రదించాలన్నారు.

నియామకం

కీసర: కీసర మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా కీసరకు చెందిన రామిడి విజయ్‌రెడ్డిని నియమిస్తూ శనివారం మేడ్చల్ నియోజకవర్గ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి తోటకూర జంగయ్య యాదవ్ నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు చెప్పారు. అందుకోసం అవసరమైన చోట కాంగ్రెస్ పోస్టులను భర్తీ చేస్తామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలు, స్థానిక మంత్రి మల్లారెడ్డి అరాచకాలను ప్రజల్లోకి పెద్ద ఎత్తున తీసుకెళ్లాలని కాంగ్రెస్ నేతలకు ఆయన సూచించారు. కార్యక్రమంలో బీబ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్‌గౌడ్, కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, నేతలు చిక్కుడు రమేష్, సాధిక్ అలీ, హరిబాబు, మధు, కృష్ణారెడ్డి, మల్లేష్‌యాదవ్, నక్కిబాబు తదితరులు పాల్గొన్నారు.



కీసర మండల కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా రామిడి విజయ్‌రెడ్డికి నియామకపత్రం అందజేస్తూ..

అక్రమ నిర్మాణం ఆపాలని కమిషనర్‌కు వినతి

కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీసీతారామాశివాంజనేయ దేవస్థాన కమిటీ స్థలంలో అక్రమ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ శనివారం ఆలయ కమిటీ చైర్మన్ మాదిరెడ్డి నర్సంహరెడ్డి ఆలయ కమిటీసభ్యులతో కలిసి దమ్మాయిగూడ మున్సిపల్ కమిషనర్ రాజమల్లుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్రమ నిర్మాణాన్ని ఆపాలని కోర్టు నుంచి స్టేకూడా తీసుకువచ్చామని కమిషనర్‌కు విన్నవించారు.

అమ్మవారి సేవలో..

ఘట్‌కేసర్: దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏడో రోజు శనివారం అమ్మవారిని పట్టణంలోని గురుకుల్ మైదానంలో లలితా దేవిగా అలంకరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్‌యాదవ్, మాజీ సర్పంచ్ యాదగిరి యాదవ్, జంగయ్యయాదవ్, ముత్యాలు యాదవ్, శివప్రదీప్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.





CISF గేట్ నెం.2 ఎదురుగా, హకీంపేట్ బస్ డిపో, సికింద్రాబాద్.

ఘనంగా సద్దుల బతుకమ్మ సంబురాలు



ఘట్‌కేసర్ గురుకుల్ క్రీడామైదానంలో బతుకమ్మ సంబురాలు



మేడ్చల్ బస్ డిపోలో బతుకమ్మ సంబరాల్లో కండక్టర్లు

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ క్రీడా మైదానంలో జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన సద్దుల బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తంగేడు, బంతి, చామంతి పూలతో 15 ఫీట్ల బతుకమ్మలను తయారు చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీజంగయ్య, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, మేడ్చల్ కాంగ్రెస్ అభ్యర్థి వజ్రేశ్ యాదవ్, మంత్రి మల్లారెడ్డి కోడలు, మల్లారెడ్డి హెల్త్ సిటీ డైరెక్టర్ ప్రీతిరెడ్డి, మాజీ సర్పంచ్ జన చైతన్య సేవా సమితి వ్యవస్థాపకుడు యాదగిరియాదవ్, జంగయ్యయాదవ్, ముత్యాలుయాదవ్, రాంచందర్‌యాదవ్, వేలాదిగా మహిళలు పాల్గొన్నారు.

బస్ డిపోలో బతుకమ్మ సంబరాలు

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ బస్ డిపోలో శనివారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. మహిళా కండక్టర్లు, సిబ్బంది బతుకమ్మను పేర్చి ఆటాపాటలతో ఆడిపాడారు. అంతకుముందు దసరా పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ సుధాకర్, అసిస్టెంట్ మేనేజర్ రామారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నాగారం మున్సిపాలిటీ పరిధిలో..

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని 7వ వార్డు కౌన్సిలర్ గూడురు సబితాఆంజనేయులుగౌడ్ ఆధ్వర్యంలో జీఎస్ఆర్ గార్డెన్‌లో ఉత్సవాల్లో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. కౌన్సిలర్ సబితాఆంనేయులుగౌడ్ మాట్లాడుతూ మన సంస్కృతి సంప్రదాయాలు, ఆడబిడ్డలకు ముచ్చటైన బతుకమ్మ పండగను నిర్వహించుకోవడం సంతోషంగా ఉందన్నారు. మధుగౌడ్, లక్ష్మీశివకుమార్, పురుషోత్తం, రవీందర్ రెడ్డి, శ్రీనివాస్‌రావు, శ్రీశైలం, యాదగిరి, లింగన్న, నిర్మల రాధా, శైలజ, వాసవి పాల్గొన్నారు.



నాగారంలోని 7వ వార్డులో బతుకమ్మ ఉత్సవాలు

పలు కళాశాలల్లో దసరా వేడుకలు



ఎమ్మార్‌సీఈ కళాశాలలో దసరా వేడుకల్లో యాజమాన్యం, అధ్యాపకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని ఎమ్మార్‌సీఈ, కండ్లకోయలోని సీఎంఆర్ మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో శనివారం దసరా వేడుకలు నిర్వహించారు. ఎమ్మార్‌సీఈలో కళాశాల డైరెక్టర్ సుధీర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ అశోక్, వైస్ ప్రిన్సిపాల్ టీవీ రెడ్డి అధ్యాపకులతో కలిసి పూజలు నిర్వహించగా, సీఎంఆర్ మెడికల్ కళాశాల, ఆస్పత్రిలో చైర్మన్ గోపాల్‌రెడ్డి, వైద్యులు, అధ్యాపకులతో కలిసి పూజలు నిర్వహించారు.



సీఎంఆర్ ఆస్పత్రిల్లో పూజల్లో చైర్మన్, వైద్యులు

పెద్దమ్మ తల్లికి ముదిరాజ్‌ల బోనాలు



ఘట్‌కేసర్‌లో పెద్దమ్మతల్లి బోనాలతో ముదిరాజ్‌లు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో ముదిరాజ్‌ల ఆరాధ్యదైవం పెద్దమ్మతల్లి బోనాల పండగను శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పసుపు కుంకుమ వేపాకులతో బోనాలను అందంగా అలంకరించి డప్పు చప్పుళ్లతో ఊరేగింపుగా తరలివెళ్లారు. అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి నైవేద్యాలు లు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఘట్‌కేసర్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కృష్ణయ్యముదిరాజ్, మాజీ అధ్యక్షుడు రాధాకృష్ణముదిరాజ్, కార్యదర్శి శ్రీశైలం ముదిరాజ్, వైస్ ప్రెసిడెంట్ పోచయ్యముదిరాజ్, కోశాధికారి శంకర్, ఆంజనేయులుముదిరాజ్, ఐలయ్యముదిరాజ్, రాజుముదిరాజ్, మహేశ్‌ముదిరాజ్, నర్సింగ్‌రావుముదిరాజ్, వెంకటేశ్‌ముదిరాజ్, రాజలింగంముదిరాజ్, దర్శన్‌ముదిరాజ్, అజయ్య ముదరాజ్, నాని, శివ మహిళలు పాల్గొన్నారు.

గంజాయి విక్రేత అరెస్ట్

పోచారం: అక్రమంగా గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని ఎక్సైజ్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఘట్‌కేసర్ ఎక్సైజ్ స్టేషన్ సీఐ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి రైల్వే స్టేషన్ నుంచి రెండు బ్యాగులతో బయటకు వస్తున్న వ్యక్తిని అనుమానించి తనిఖీ చేయగా 12 కేజీల గంజాయి దొరికింది. వెంటనే అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా ఒడిశా నుంచి గంజాయి తెచ్చి చర్లపల్లిలో అమ్ముతున్నట్లు తెలిసింది. ముద్దాయిని ఒడిశాలోని దానిసహీ ప్రాంతానికి చెందిన రోసన్ మహకుడ్ (23)గా గుర్తించారు. గంజాయితో పాటు సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని, అతడిని రిమాండ్‌కు తరలించారు.



గంజాయితో పోలీసులకు పట్టుబడిన ముద్దాయి

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220387